రాజన్న రాజ్యం జగనన్నకే సాధ్యం

• ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



వృద్ధుడికి సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గుంతకల్లు రూరల్: రాజన్న రాజ్యం జగనన్నకే సాధ్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం దోసలుడుకి గ్రామంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్తె మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో కలిసి గ్రామంలో ప్రతి ఇంటినీ సందర్శించిన ఎమ్మెల్యే నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కార చర్యలు చేపడతానని గ్రామస్తులకు తెలియజేశారు. ప్రజలే దేవుళ్లుగా బావించి నాలుగేళ్లుగా ప్రజల కోసమే కష్టపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ముఖ్యమంత్రి ఎన్నో రకాల అభివృద్ధి పనులతో రాష్ట్రాన్ని దేశం గర్వించదగ్గ స్థాయిలో నిలిపారన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా లక్షలాదిమంది నిరుద్యోగుల ఇళ్లలో దీపం వెలిగించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీడీఓ జాషువా, ఎంపీపీ బీవీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, సర్పంచ్ జయలక్ష్మి, ఎంపీటీసీ యం.శీలమ్మ, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మండల కన్వీనర్ మోహన్‌రావు, సచివాలయ మండల కన్వీనర్ గోవిందు నాయక్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జయరామిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి,కోఆప్షన్ సభ్యుడు సిపాయిబాషా, నాయకులు యోగానందరెడ్డి, లంకిరెడ్డి, నాగేష్, దేవేంద్ర, మోహన్, రామురెడ్డి, చంద్ర, అంజినిరెడ్డి, నాగప్ప, లాలిరెడ్డి, సాయిరాంరెడ్డి, తిమ్మారెడ్డి, వెంకటరాముడు, హనుమేష్, అశోక్, రమేష్ నాయక్, మల్లికార్జునరెడ్డి, కిష్టప్ప, మల్లికార్జున, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి జగనన్న కృషి

• జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పథకం మహిళల పేరు మీద అమలు చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శుక్రవారం పుట్లూరు మండలం రంగరాజుకుంట, రంగమనాయునిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రతి పథకం వారి పేరున అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యానికి పెద్ద పీట వేశారన్నారు. పేదరికం పోవాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. అందుకే విద్యార్థులకు అమ్మఒడి పథకంను ఇంటర్ మీడియట్ వరకు, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ ఉన్నత చదువుకొనే వారికీ అందిస్తున్నారన్నారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వాదించాలని కోరారు. ఈకార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మూలి వెంకటరామిరెడ్డి, సర్పంచ్‌లు రామాంజులరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరేష్, శ్రీధర్‌రెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి విడదల రజినికి ఘన స్వాగతం



మంత్రి రజినికి స్వాగతం పలుకుతున్న నాయకులు

గుత్తి: గుత్తి శివారులోని టోల్ గేట్ వద్ద శుక్రవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికి వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి విజయవాడ నుంచి రోడ్డు మార్గం ద్వారా అనంతపురం పర్యటనకు వచ్చారు. యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ హరీష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్‌యాదవ్, గుత్తి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, కౌన్సిలర్లు ఫరూక్, వాల్మీకి శివ, వరదరాజులు తదితరులు టోల్ గేట్ వద్దకు వెళ్లి మంత్రికి ఘన స్వాగతం పలికారు.

ఈఓఆర్‌డీకి డీఎల్‌పీఓగా పదోన్నతి

శింగనమల: శింగనమలలో ఈఓఆర్‌డీగా పని చేస్తున్న శివనారాయణరెడ్డి డీఎల్‌పీఓగా పదోన్నతి పొందారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుగొండకు బదిలీ చేశారు. శుక్రవారం ఆయన రిలీవ్ కావడంతో సిబ్బంది సన్మానించారు.

క్లుప్తంగా

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



కాశమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

గుంతకల్లుటౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళకు వలంటీర్ కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేశాడు. వివరాలు..పాతగుంతకల్లు గుట్ట ఏరియా–1 వార్డు సచివాలయానికి చెందిన జె.కాశమ్మ అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ సందీప్ కర్నూలు వెళ్లి పింఛన్ సొమ్ము అందించాడు. ఈసందర్భంగా ఆమె సీఎం జగన్, వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారం తప్పనిసరి

బుక్కరాయసముద్రం: గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వాతి లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

గుంతకల్లు: స్థానిక వాసవీ కన్యకపరమేశ్వరీ దేవి ఆలయంలో వాసవీ మాత జయంత్యుత్సవాల్లో భాగంగా శుక్రవారం గాయత్రీ హోమం నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్ర నామ పారాయణం, దాదాపు 500 మహిళలు కుంకుమార్చన చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వాసవీ మాత ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోపా జగదీష్, కందూరి కృపాకర్, కోశాధికారి మేడం వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

నేడు ఇంటి పట్టాల పంపిణీ

గుత్తి రూరల్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మార్కెట్ యార్డులో శనివారం ఇంటి పట్టాల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. మండల వ్యాప్తంగా 223 మంది ఎంపిక చేశామని, అర్హులైన వారికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పట్టాలు అందిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా కారల్‌మార్క్స్ జయంతి



మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక సీపీఐ కార్యాలయంలో కారల్ మార్క్స్ 205వ జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ నాయకులు ఎస్ఎండీ గౌస్, రామాంజినేయులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బుక్కరాయసముద్రం: రేకులకుంట సమీపంలో నార్పల అనంతపురం రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. చెన్నంపల్లి గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి అనంతపురం నుంచి చెన్నంపల్లికి బైక్‌పై బయలుదేరాడు. రేకులకుంట సమీపంలో నార్పల నుంచి అనంతపురం వైపు వస్తున్న కారు ఢీకొనడంతో వెంకట సుబ్బారెడ్డికి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇతడితోపాడు మరో బైక్‌పై వస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న సీఐ, గ్రామపెద్దలు

గుత్తి రూరల్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అన్నమయ్య జిల్లా రాయచోటి సీఐ కృష్ణయ్య యాదవ్, గ్రామపెద్ద ఎస్‌సీ.రంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం టి.కొత్తపల్లిలో జిల్లా స్థాయి వీరాంజనేయ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలని వారు సూచించారు. విజేత జట్టుకు సీఐ కృష్ణయ్య రూ.30 వేలు అందించనున్నట్లు ప్రకటించారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వర విగ్రహ ప్రతిష్ట



ఎమ్మెల్యే వైవీఆర్ ను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

గుత్తి రూరల్: ఊబిచెర్లలో శుక్రవారం కాశీవిశ్వేశ్వర స్వామి విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్టోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచి వేద పండితులు, అర్చకులు ప్రాతకాల పూజలు, యంత్ర ప్రతిష్ట, హోమాలు, ప్రాణ ప్రతిష్ట, పూర్ణాహుతి, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే వై.వెంకట రామిరెడ్డి, ఏడీసీసీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు పామిడి వీరా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యేకి అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు. గ్రామస్తులు పూలమాలలు, శాలువాతో ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు.

ప్రజా సంక్షేమయాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: తాడిపత్రి మండలంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి త్వరలో చేపట్టబోయే ప్రజా సంక్షేమయాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆపార్టీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలకు తక్షణ పరిష్కారాలను చూపుతున్నారన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు వారికి ఇంకా ఏం కావాలో స్వయంగా తెలుసుకునేందుకు ప్రజా సంక్షేమయాత్రను ప్రారంభించారన్నారు. ఇప్పటికే పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల్లో యాత్ర దిగ్విజయంగా ముగిసిందన్నారు. తాడిపత్రి మండలంలో జరిగే యాత్రకు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

బాక్సింగ్‌లో గుంతకల్లు విద్యార్థిని ప్రతిభ



కాంస్య పతకం అందుకుంటున్న తన్మయి

గుంతకల్లు: తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ టోర్నీలో బాక్సింగ్ విభాగంలో గుంతకల్లు శ్రీ శంకరనంద గిరిస్వామి డిగ్రీ కళాశాల విద్యార్థి తన్మయి ప్రతిభ చాటినట్లు కళాశాల యాజమాన్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 1 నుంచి 5 వరకు సీఎం కప్ టోర్నీలో భాగంగా తమ కళాశాలకు చెందిన ఫైనలియర్ విద్యార్థి తన్మయి మూడో స్థానంలో నిలిచి బాక్సింగ్ విభాగం రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేశ్వర్లు చేతులు మీదుగా కాంస్య పతకం అందుకున్నట్లు కళాశాల యాజమాన్యంతోపాటు తల్లితండ్రులు జయవాణి, కనకరాజు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగారావు

తాడిపత్రి: మండలంలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ రంగారావు అధికారులకు సూచించారు. ఎంపీపీ సరస్వతి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. మొదటగా ఆయా మండల అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. నిధులు పుష్కలంగా ఉన్నాయని, గ్రామాల్లో కావాల్సిన అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించి పనులు ప్రారంభించాలని ఎంపీపీ కోరారు. తహసీల్దార్ మునివేలు, ఈఓఆర్డీ జిలాన్‌బాషా, ఏఓ వాసుదేవరెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఎస్పీ వైఖరి తెలియజేయాలి

తాడిపత్రి అర్బన్: ఎస్సీ రిజర్వేషన్, వర్గీకరణపై బీఎస్పీ అధినేత్రి మాయావతి తన స్పష్టమైన వైఖరేంటో తెలపాలని ఎమ్మార్పీఎస్ మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఈనెల7న తెలంగాణలోని హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ భరోసా సభకు మాయావతి రానున్న నేపథ్యంలో శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నిరసన తెలిపారు. నాయకులు ఆదినారాయణ, రవి, బాలచంద్రుడు, లక్ష్మీదేవి, తులసి, నారాయణమ్మలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో కొండపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం నరసింహస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని పూలతో అలంకరించి విశేష పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

11న ఖత్నా

తాడిపత్రి అర్బన్: ఈనెల 11న ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నూర్‌బాషా దూదేకుల సేవా సంఘం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 8గంటలకు పుట్లూరు రోడ్డులోని టీటీడీ కల్యాణమండపం సమీపంలోని నూర్‌బాషా దూదేకుల సేవా సంఘం కార్యాలయంలో కార్యక్రమాన్ని ఉంటుందని, ఖత్నా చేయించుకోదలచిన వారు మంగళవారం లోగా పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించింది.

కొనసాగిన బండిశిల తిరునాల

పామిడి: రామరాజుపల్లిలో శుక్రవారం మూడోరోజు బండిశిల తిరునాలను సాగింది. గుత్తి అనంతపురం నుంచి కాశేపల్లి మీదుగా బండిశిల రథం గురువారం అర్ధరాత్రి దాటాక తిరిగి రామరాజుపల్లికి చేరింది. ఈసందర్భంగా సుంకులమ్మ, ముత్యాలయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బండిశిల రథాన్ని గుత్తి అనంతపురం వైపునకు ఏడుగాండ్ల వృషభాలతో లాగించారు.

బండిశిల రథాన్ని లాగుతున్న దృశ్యం



నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లు రూరల్: గుండాలతండాలో శనివారం మధ్యాహ్నం 3.30 గంటల ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాషువా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

శింగనమల: పుట్లూరు మండలం కుమ్మనమల, కొండగారికుంట గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ యోగానందారెడ్డి తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

వైభవంగా చౌడేశ్వరి విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో చౌడేశ్వరీదేవి

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో శుక్రవారం చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజామున 3 గంటల నుంచి చౌడేశ్వరీదేవి, కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజ, శిఖర ప్రతిష్ఠ, నేత్రోన్మీళనం, ప్రాణ ప్రతిష్ఠ, కళ్యాణ్వాల, పూర్ణాహుతి, కళశ ఉద్వాసన, కుంభాభిషేకం చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

కమనీయం.. వేంకటరమణుడి కల్యాణం



స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

శింగనమల: స్థానిక గొల్లకొండ వేంకటరమణ స్వామి ఆలయంలో గురువారం రాత్రి కమనీయంగా సాగింది. ముందుగా స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం రాత్రి 10 గంటల నుంచి 11.30 గంటల మధ్య కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు పంపించిన ముత్యాల తలంబ్రాలను, పట్టువస్త్రాలను స్వామికి సమర్పించారు. ఈసందర్భంగా నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలను డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి ప్రారంభించారు. గార్లదిన్నెకు చెందిన రామాంజినేయులు వృషభాలు ప్రథమ,గార్లదిన్నె మండలం కృష్ణాపురానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి వృషభాలు ద్వితీయ, అదే గ్రామానికి చెందిన నాగరాజు వృషభాలు తృతీయ, కుందనంకోటకు చెందిన చెన్నప్ప వృషభాలు నాలుగో, శింగనమల మండలం కల్లుమడికి చెందిన మహేందర్‌రెడ్డి వృషభాలు ఐదో స్థానంలో నిలిచాయి. వృషభాల యజమానులకు వైఎస్సార్‌సీపీ నాయకులు కే. గోవిందరెడ్డి, గొల్లారెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



బంగారు పతకం అందుకుంటున్న దివ్య

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థిని బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు పీఈటీ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 1న తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో ఏపీ సీఎం కప్ సీనియర్ బాక్సింగ్ పోటీల్లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న దివ్య నందిని 81 కేజీల విభాగంలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించిందన్నారు. ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గార్లదిన్నె: మోడల్ స్కూల్లో 2023–24కు సంబంధించి ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈనెల 10నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సతీష్ శుక్రవారం పేర్కొన్నారు. జూన్ 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

పామిడి: మోడల్ స్కూల్లో 2023–24కు సంబంధించి ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈనెల 9 నుంచి 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

గుంతకల్లుటౌన్: ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు డిగ్రీలో చేరడానికి శ్రీకన్యకాపరమేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జ్ఞానేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ(హెచ్ఈపీ,హెచ్‌పీటీ,హెచ్‌పీఈ), బీకాం జనరల్, కంప్యూటర్స్, బీఎస్సీ(ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఈసీఎస్, బీజడ్‌సీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, తదితర గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ఈ-కేవైసీ పూర్తి చేయించండి

శింగనమల: మండలంలోని రైతులు ఇంకా పీఎం కిసాన్ ఈ-కేవైసీ చేయించకుంటే, వెంటనే పూర్తి చేయించాలని ఏఓ చిన్నమ్మ తెలిపారు. శుక్రవారం చక్రాయిపేట ఆర్బీకేలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ విత్తన పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు. రోజూ కియోస్క్ ని పరిశీలించి, రైతులకు సమాచారం అందించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు కావల్సిన ఎరువులు బుక్ చేయాలన్నారు. ట్రాక్టర్ నగర్‌లో చిరుధాన్యాల ఆవశ్యకతపై సమావేశం ఉందని, రైతులు పాల్గొనేలా తెలియజేయాలన్నారు. ఏఈఓ అక్కమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గుత్తి రూరల్: బసినేపల్లి తండా గ్రామ శివారులో నాటుసారా తరలిస్తున్న కమలాకర్‌నాయక్ అనే వ్యక్తిని శుక్రవారం సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 10 లీటర్ల నాటుసారా, బైక్ స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఐ అలీ అహ్మద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి అర్బన్: హనుమాన్ జంక్షన్‌లోని కార్యాలయంలో శుక్రవారం అధ్యక్షుడు షాకీర్‌బాషా ఆధ్వర్యంలో మానసిక, దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కిశోర్, సభ్యులు ఇస్మాయిల్, మద్దిలేటి, నాగేంద్ర, రఫీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పామిడి: పట్టణంలోని పామిడిమ్మవీధికి చెందిన సుధాకర్ శుక్రవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు వివరాలు.. సుధాకర్ కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషించేవాడు. దీంతో పాటు పూలతోట సాగు చేశాడు. గతేడాది పెన్నానదికి వచ్చిన వరదల్లో తోట కొట్టుకుపోవడంతో నష్టం వాటిల్లింది. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య లీలావతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి మృతుడి భార్యకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబాన్ని ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు, పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, నాయకులుబీ ఆసిఫ్, అనుంపల్లి సూరి, బోయ రామచంద్ర, జోజోడే కుమార్ పరామర్శించారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

తాడిపత్రి అర్బన్: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, రాజగోపాల్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మార్కెట్ యార్డులోని రవాణాశాఖ కార్యాలయం, హనుమాన్ జంక్షన్‌లో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలు కండీషన్లో ఉండకపోవడం, అతివేగం, నిర్లక్ష్యం, అవగాహన లోపంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.